
ప్రజాశక్తి
బుధవారం 5 నవంబర్ 2025
5
పార్వతీపురం మన్యం



ధాన్యం కొనుగోలు వేగవంతం : జెసి

ప్రజాశక్తి–పార్వతీపురం

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత సమర్ధవంతంగా నిర్వహించేందుకు జాయింట్ కలెక్టర్ సి యశ్వంత్ కుమార్ రెడ్డి మంగళవారం సంబంధిత శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద అందుబాటులో ఉండి, రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చేలా మార్గనిర్దేశం చేయాలని సూచించారు. తేమ శాతం విషయంలో ఎలాంటి ఫిర్యాదులకు తావు లేకుండా, నిబంధనల మేరకు మాత్రమే కొనుగోలు చేయాలని పౌరసరఫరాల జిల్లామేనేజర్‌కు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోదాములకు చేర్చడానికి జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో రవాణా ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

తెలుగు తమ్ముళ్ల భూ దందాలు

ప్రజాశక్తి – పార్వతీపురం

నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల భూ దందాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న చందంగా అధికార పార్టీ నాయకులు ప్రభుత్వ భూములపై కన్నేసి ఆక్రమణకు పాల్పడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ప్రభుత్వ భూములు, కాలువల కబ్జాలు రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నట్టు తెలుస్తోంది. నియోజకవర్గానికి చెందిన కీలక నేత అండదండలతో స్థానిక నాయకులు ఆక్రమణల పర్వానికి తెరలేపుతున్నారు. ఈ భూ బాగోతంలో ఆ కీలక నేతకు కూడా దండిగా ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్వతీపురం పట్టణం జిల్లా కేంద్రమైన తర్వాత పాలకపార్టీల అండతో ఎక్కువగా ప్రభుత్వ చెరువులు, భూముల ఆక్రమణ లు సాగుతున్నాయి. పట్టణం నడిబొడ్డున ఉన్న వరహాల గెడ్డ పోరంబోకు భూమిని ఈనెల 12న చెందిన ఓ షాపింగ్ మాల్ యజమానికి రిజిస్ట్రేషన్ చేయడం చర్చనీయాంశమవుతోంది. సర్వే నెంబర్ 410లో గల సుమారు 800 గజాల గెడ్డ పోరంబోకు భూమిని పక్కనున్న జిరాయితీ సర్వే నెంబర్ 411–9 లో 400 గజాల స్థలంతో కలిపి పట్టణానికి చెందిన ఓ వ్యాపారి దర్జాగా విక్రయించారు. ఆ వ్యాపారి అంత దర్జాగా ప్రభుత్వ భూమిని విక్రయించి రిజిస్ట్రేషన్ చేయించడం వెనుక నియోజకవర్గ ముఖ్య నేత అండదండలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. సుమారు రూ.18కోట్ల విలువైన గెడ్డ పోరంబోకు భూమిని అధికారపార్టీకి చెందిన ముఖ్యనేత సహకారంతో విక్రయించిన వ్యవహారం లో ఆ నేత కు కోట్లాది రూపాయలు అందాయనే చర్చ నడుస్తోంది.

బల్లిపేటలో తెలుగు తమ్ముళ్ల దందా

పార్వతీపురం నియోజకవర్గంలోని బల్లిపేట గ్రామంలోనూ ఆ ముఖ్యనేత అండతోనే ప్రభుత్వ మెట్ట భూమిని స్థానిక టిడిపి నాయకులు ఆక్రమేసినట్టు స్థానికులు చెబుతున్నారు. సర్వే నెంబర్ 32/2లో ఉన్న ప్రభుత్వ భూమిని స్థానిక టిడిపి నాయకులు అండతో ఆక్రమించి చుట్టూ కంచె వేయడం వివాదాస్పద మవుతోంది. ఈ ఆక్రమణదారులకు మండల తహశీల్దార్ మద్దతు కూడా ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల స్థానికులు ఫిర్యాదు మేరకు పార్వతీపురం సబ్ కలెక్టర్ వైశాలి ఆ స్థలాన్ని పరిశీలించి విచారణ నిర్వహించారు. ఆక్రమించిన స్థలం చుట్టూ ఉన్న కంచెను తొలగించాలని తహశీల్దార్‌ను సబ్ కలెక్టర్ వైశాలి ఆదేశించారు. అయినప్పటికీ తహశీల్దార్ ఆక్రమణ స్థలం చుట్టూ ఉన్న కంచెను తొలగించలేదు. అయితే ఆ కంచెను తొలగించినట్టు తహశీల్దార్ ఫిర్యాదుదారులకు లిఖితపూర్వక వివరణ ఇవ్వారు. ఈ వ్యవహారంలో టిడిపి ముఖ్యనేతతో పాటు స్థానిక నాయకులకు, అధికారులకు ముడుపులు ముట్టాయని ప్రచారం జరుగుతోంది.

ధనుంజయపురంలో...

పట్టణానికి కూతవేటు దూరంలో మండలంలోని ధనుంజయపురం గ్రామానికి చెందిన సుమారు 30ఎకరాల డి–పట్టా భూమిని పట్టణానికి చెందిన ఓ టిడిపి సీనియర్ నాయకుడు ఆక్రమించినట్టు ఆరోపణలు వున్నాయి. తన బంధువుల పేరిట ఆ భూములకు సంబంధించి పట్టాలు చేయించుకుని దర్జాగా అనుభవిస్తున్నారు. డి–పట్టా భూములను జిరాయితీ భూమిగా మార్చుకొని సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.జిల్లా రవాణా కార్యాలయం వెనుక ఉన్న భూమి విలువ ప్రస్తుతం ఎకరా నాలుగు కోట్ల వరకు ఉంటుంది. సర్వే నెంబర్ 216, 219, 228లో ఉన్న ప్రభుత్వ భూమిని ఆ పట్టణ నాయకుడు 2014 నుంచి 2019 మధ్య కాలంలోనే ఆక్రమించి పట్టాలు చేయించుకున్నారనే వాదనలు ఉన్నాయి. పేదలు సాగు చేస్తున్న ప్రభుత్వ భూమికి పట్టాలివ్వడానికి మీనమేషాలు లెక్కించే రెవెన్యూ అధికారులు పెత్తందార్లకు కోట్లు విలువ చేసే భూములను ధారాదత్తం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ భూకబ్జాలపై కూటమి పార్టీకి చెందిన ఓ కీలకనాయకుడు ఆధారాలతో సహా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నారు.

ముఖ్యనేత అండతో ప్రభుత్వ భూముల కబ్జా
రెవెన్యూ కనుసన్నల్లోనే ఆక్రమణలు
చోద్యం చూస్తున్న జిల్లా యంత్రాంగం



డిఆర్‌ఒకు వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు

భూకబ్జాలపై సమగ్ర విచారణ చేపట్టాలి : డిఆర్‌ఒకు సిపిఎం వినతి

జిల్లా కేంద్రంలో ఇటీవల సర్వే నెంబరు మార్పి వరహాల గెడ్డ స్థలాన్ని అమ్మకం జరిపిన అంశంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, జిల్లా కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ, బివి రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు డిఆర్ఒ కె.హేమలతకు భూ కబ్జాలు, లేని భూమికి పక్క సర్వేనెంబర్లు వేసి రిజిస్ట్రేషన్ చేయడం, తప్పుడు రిజిస్ట్రేషన్లపై సమగ్రమైన అంశాలతో కూడిన వినతిపత్రం మంగళవారం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంగా పార్వతీపురం ఏర్పడిన తర్వాత భూముల విలువ పెరిగిన నేపథ్యంలో పట్టణంలో ప్రభుత్వ భూములు, చెరువులు, గెడ్డలు ఆక్రమణలకు కొంతమంది వ్యక్తులు పాల్పడుతున్నారని చెప్పారు. దీనికి అధికార పార్టీ పెద్దలు సహకారం అందిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి భూ ఆక్రమణలను రెవెన్యూ, రిజిస్ట్రేషన్, మున్సిపల్ శాఖల అధికారులు కూడా తోడ్పాటు అందిస్తున్నారని చెప్పారు మున్సిపల్ నిబంధనల ప్రకారం చెరువులు, గెడ్డ పోరంబోకు స్థలంలో భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకూడదని, ఆ అంశాలను బహిరంగంగా ప్రకటిస్తే ఇలాంటి తప్పుడు రిజిస్ట్రేషన్లు, భూ ఆక్రమణలు జరగవని తెలిపారు. పార్వతీపురం పట్టణంలో అనేకమైన చెరువులు, గెడ్డ పోరంబోకు స్థలాలు ఆక్రమణ గురవుతున్న విషయాన్ని ఇప్పటికే అనేక సందర్భాలలో జిల్లా అధికారులకు తెలిపినా ఎలాంటి స్పందన లేదన్నారు. దీంతో ఆక్రమణదారులు బరితెగించి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా జిల్లా రెవెన్యూ, మున్సిపల్ యంత్రాంగం ఈ ఆక్రమణలపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని, వరహాల గెడ్డ పూర్తి స్వరూపం తెలిపేలా హద్దులు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. 410 సర్వే నెంబర్‌లోని వరహాలగెడ్డ భూ ఆక్రమణలపై త్వరలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. దీనికి డిఆర్ఒ స్పందిస్తూ వరహాల గెడ్డ ఆక్రమణల అంశం ఇప్పటికే తమ దృష్టికి వచ్చిందని, తక్షణమే దర్యాప్తు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి.చిన్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేరుకే 'మరుగు'.. తలుపులు కనుమరుగు

ముప్పావు మందికి మంచాలు కరువు
ఎర్ర సామంతవలస ఆశ్రమ పాఠశాల విద్యార్థుల అవస్థలు

ప్రజాశక్తి – మక్కువ

గిరిజన విద్యార్థుల అభివృద్ధి, సంక్షేమానికి ఎన్నో కోట్లు ఖర్చు పెడుతూ వస్తున్న ప్రభుత్వాలు అవి కాగితాలకే పరిమితమవుతున్నాయన్నది ఆయా ఆశ్రమ పాఠశాలలో కనిపిస్తున్న దృశ్యాలే ప్రత్యక్ష సాక్ష్యాలుగా నిలుస్తున్నాయని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. కనీస మౌలిక సదుపాయాల విషయానికి వస్తే అంతంత మాత్రంగానే న్నాయి. తాము పడుతున్న అవస్థలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి పరిస్థితే మండలంలోని ఎర్ర సామంతవలస ఆశ్రమ పాఠశాలలో నెలకొంది.

ఎర్రసామంతవలస ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు తాగునీరు, మరుగుదొడ్లు, మంచాలు సమస్యలతో సతమతమవుతున్నారు. సుమారు 350 మంది విద్యార్థులు ఇక్కడ విద్యాభ్యాసం చేస్తుండగా, అందులో 315 మంది హాస్టల్లో వసతి పొందుతున్నారు. ఒక్క మక్కువ మండలమే కాకుండా జిల్లాలోని పలు మండలాలకు చెందిన విద్యార్థులు ఇక్కడ చదువుకుంటూ వసతి పొందుతున్నారు. రెండు బెర్తులు గల 60 బెడ్లు ఉండగా, కేవలం 120 మంది విద్యార్థులు పడుకునేందుకు మాత్రమే వెసులుబాటుగా ఉంది. మిగిలిన 195 మంది విద్యార్థులు ఆయా గదుల్లో నేలపైనే పడుకోవాల్సిన పరిస్థితి. విద్యార్థులందరికీ 20 మరుగుదొడ్లు ఉండగా వాటిలో సగానికి పైగా తలుపులే లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. 'పేరుకే మరుగుదొడ్లు తప్ప అంతా బహిరంగమే అన్నట్లు అనిపిస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. పొద్దున్నే మరుగుదొడ్ల కోసం క్యూలైన్‌లో నిల్చోవల్సిన పరిస్థితి ఏర్పడుతుండడం విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. కాలకృత్యాలు తీర్చుకొన్న చోటే బట్టలు కూడా ఉతుక్కోవాల్సి వస్తోందని వాపోతున్నారు. బట్టలు ఉతుక్కునేందుకు ప్రత్యేక ప్లాట్‌ఫాం ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. మంచినీటి కోసం ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ పాడైపోయి నెలలు గడుస్తున్నా పట్టించుకునే నాథుడు లేదు. ఇటీవల వేడి నీటిని తాగేందుకు ఇస్తున్నారని విద్యార్థులు చెబుతున్నారు. అనారోగ్యాల కారణాలతో పాటు నేలపై పడుకోవడం వల్ల తేళ్లు, జెర్రులు కాటువేసే ప్రమాదం కూడా ఉందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గిరిజన ఆశ్రమ పాఠశాలలలో మౌలిక సదుపాయాలన్నీ మెరుగుపరచాలని కోరుతున్నారు



ఎర్రసామంతవలసలోని ఆశ్రమ పాఠశాల



తలుపుల్లేని మరుగుదొడ్లు


మాకెందుకు ఈ తలనొప్పి..?

ఇక్కడి హాస్టల్‌ను నిర్వహించేందుకు ఏ ఒక్కరూ ముందుకు రావడంలేదు. ఇటీవలే తాడంగి చిన్నారి అనే విద్యార్థి మృతి చెందిన తర్వాత స్థానిక హెచ్‌ఎం, వార్డెన్లను అధికారులు సస్పెండ్ చేశారు. దీంతో వార్డెన్ బాధ్యతలను నిర్వహించేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు. దీంతో జిల్లా అధికారులు ఒప్పించి స్థానిక టీచర్ ఎం.పోలినాయుడును తాత్కాలికంగా బాధ్యతలు చూడాలని అప్పగించారు. ఇదిఇలా ఉండగా రెగ్యులర్ ఉద్యోగి కమాటి ఒక్కరే ఉన్నారు. మరో వంట మనిషి లేకపోవడంతో స్థానికంగానే ఖర్చులు వెచ్చించి ప్రైవేటుగా ఏర్పాటు చేసుకునే పరిస్థితి ఉంది. దీంతో ఆర్థిక భారం ఎక్కువ కావడంతో వార్డెన్ బాధ్యతలు నిర్వహించేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. విద్యార్థులు అనారోగ్య బారిన పడితే వారికి వైద్యం ఖర్చులు కూడా వార్డెన్‌పైనే భారం పడుతుంది. అన్నింటికీ తమ చేతి డబ్బులు పెట్టుకోవాల్సిన ఉండడంతో వార్డెన్‌గా ఎవరూ బాధ్యతలు చేపట్టేందు విముఖత చూపుతున్నారు.

డిఎస్‌సి ఉపాధ్యాయులకు సెలవులివ్వాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి – పార్వతీపురం

నూతన డిఎస్‌సి ద్వారా చేరిన ఉపాధ్యాయులకు సాధారణ సెలవులు వినియోగించుకొనే ఏర్పాటు చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు విద్యాశాఖ అధికారులను కోరారు. ఉపాధ్యాయుల ముఖ హాజరు, లీవ్ యాప్‌ల్లో వారు సాధారణ, ప్రత్యేక సాధారణ సెలవులు వాడుకునేందుకు టైల్స్‌ను ఏర్పాటు చేయకపోవడం వల్ల అనారోగ్యం వచ్చినా వారు సెలవు పెట్టుకోలేని పరిస్థితి ఉందన్నారు. తప్పని సరై వారు డిడిఒలను రిక్వెస్ట్ చేసి ఉండిపోతే వారికి గైర్హాజరుగా నమోదు అవుతోందని చెప్పారు. ఇప్పటికే వారు విధుల్లో చేరి నెల రోజులు పూర్తి అయినందున వెంటనే సంబంధిత టైల్స్ ఎనేబుల్ చేయాలని కోరారు. ప్రస్తుతం అయిచ్చిక సెలవు వాడుకునేందుకు మంగళవారం ఏర్పాటు చేశారని తెలిపారు.



ఐక్యతా మార్చ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

సర్దార్ @150 ఐక్యతా మార్చ్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి – పార్వతీపురం

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని మై భారత్ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహించనున్న 'సర్దార్ ఏ150 ఐక్యతా మార్చ్ ప్రచార పోస్టర్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ సమగ్రతకు చేసిన కృషిని కొనియాడారు. పటేల్ దూరదృష్టి, నాయకత్వ పటిమ వల్లే దేశం ఏకమైందని, ఆయన ఆశయాలను నేటి యువత, ప్రజలు స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రారంభించిన 'ఐక్యతా మార్చ్' అక్టోబర్ 30 నుంచి నవంబర్ 24 వరకు జిల్లా స్థాయి పాదయాత్రగా కొనసాగే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా 'ఏక్ భారత్, ఆత్మనిర్భర్ భారత్' ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, దేశభక్తిని పెంపొందించేందుకు కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఐక్యతా మార్చ్ ద్వారా సర్దార్ పటేల్ ఆదర్శాలను ప్రజలందరికీ తెలియజేయాలని, అలాగే స్వచ్ఛతా కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు, మాదక ద్రవ్యాలు లేని భారతదేశం కోసం ప్రతిజ్ఞ వంటి కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.

హాట్ ఎయిర్ బెలూన్ ద్వారా మన్యం అందాలు

ప్రజాశక్తి – సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో ఏర్పాటు చేసిన హాట్ ఎయిర్ బెలూన్ ద్వారా విహంగ వీక్షణం చేస్తూ మన్యం అందాలను తిలకించవచ్చని ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ హాట్ ఎయిర్ బెలూన్ ద్వారా 300 అడుగులు ఎత్తులోకి వెళ్ళవచ్చని, ఈ బెలూన్ ద్వారా ఒకేసారి నలుగురు వెళ్ళవచ్చని తెలిపారు. ఉదయం 7 నుంచి 12 వరకు మధ్యాహ్నం 1 నుంచి 8 వరకు వాతావరణ పరిస్థితులను బట్టి అందుబాటులో ఉంటుందని తెలిపారు. భద్రత పరంగా అన్ని రకాలుగా అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. దీని ధర పెద్దలకు రూ.వెయ్యి, పదేళ్లలోపు పిల్లలకు రూ.800గా ఉంటుందన్నారు. హాట్ ఎయిర్ బెలూన్ ముందుగా బుక్ చేసుకోవాలనుకున్న వారు 63016 66723 నెంబర్ కు సంప్రదించాలని పిఒ కోరారు.

పార్కులో అద్దెకు ఫుడ్ స్టాల్స్

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో అద్దె ప్రాతిపదికన ఫుడ్ స్టాల్ ఏర్పాటు చేసుకొని నిర్వహించేందుకు గానూ నిర్వాహకుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్క్ లోపల ఫుడ్ స్టాల్‌ను ఐటిడిఎ సూచించిన డిజైన్‌లో నిర్మించుకొని ఫుడ్ స్టాల్ నిర్వహించుకో వచ్చని తెలిపారు. ఈ స్టాల్‌ను నిర్వాహకులే నిర్మించుకోవాలని సూచించారు. ఏడాదికి లీజుకు రూ.20వేలు డిపాజిట్ కట్టాల్సి ఉంటుందని తెలిపారు. దీంతో పాటు నెలకు రూ.5వేలు అద్దెను ఐటిడిఎకు చెల్లించాల్సిఉంటుందని తెలిపారు. కావున ఆసక్తి కలిగిన నిర్వాహకులు పూర్తి వివరాలకు 9493469084, 9701107785 నెంబర్లకు సంప్రదించవచ్చని పిఒ తెలిపారు.

పర్యాటక ప్రాంతాల సందర్శనకు ఆటో, మ్యాక్సీ క్యాబ్ నిర్వాహకుల నుండి దరఖాస్తులు

అలాగే సీతంపేట ఏజెన్సీ మన్యంలో ఉన్న పర్యాటక ప్రాంతాలను వీక్షించేందుకు పర్యాటకులను తీసుకెళ్లడానికి ఆసక్తి ఉన్న ఆటో, మ్యాక్సీ క్యాబ్ నిర్వాహకుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు పిఒ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటిడిఎ పరిధిలోని పర్యాటక ప్రాంతాలైన ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కు, మెట్టుగూడ జలపాతం, ఆడలి వ్యూ పాయింట్, టిటిడి దేవాలయం, బెనరాయి జలపాతం, దారిమల్లి జలపాతం వంటి ప్రాంతాలకు ఒక రోజంతా పర్యాటకులను ఆటో లేదా మ్యాక్సీ క్యాబ్‌లో తీసుకెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. అందుకుగాను నిర్దేశిత రుసుంను ఐటిడిఎ నిర్ణయిస్తుందని తెలిపారు. కావున ఆసక్తి కలిగిన ఆటో మరియు క్యాబ్ నిర్వాహకులు పూర్తి వివరాల కొరకు 9493469084, 9701107785 నెంబర్లకు సంప్రదించవచ్చని పిఒ తెలిపారు.



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలి

ఎస్‌ఎఫ్‌ఐ కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి – గుమ్మలక్ష్మీపురం

జిల్లాలో మృతి చెందిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి ఎ.గంగారావు డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థుల మృతికి సంఘీభావంగా ఎల్విన్‌పేట నుంచి గుమ్మలక్ష్మీపురం వరకు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మంగళవారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు నష్ట పరిహారం అందించాలని నినాదాలు చేశారు. విద్యార్థులు మృతి చెందితే ప్రభుత్వం కనీసం కనికరం చూపకపోవడం శోచనీయమన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 14 మంది విద్యార్థుల వరకు మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించలేదని అన్నారు. ఆరోగ్య కార్యకర్తలు లేకపోవడంతో విద్యార్థుల ఆరోగ్యానికి రక్షణ కరువైందన్నారు. విద్యార్థులకు అనారోగ్యం వాటిలితే ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఉందన్నారు. తక్షణమే ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్‌ఎంలను నియమించాలని డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక వసతుల్లేక విద్యార్థులు అవస్థల నడుమ చదువులు సాగిస్తున్నారని, అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. సమస్యలు అన్నింటిని పరిష్కరించకపోతే గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజనుల అవసరాల రీత్యా కొత్త రోడ్లు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి – కొమరాడ

గిరిజన ప్రాంతంలో ప్రజా అవసరాల రీత్యా అవసరమైన చోట కొత్త రోడ్లు మంజూరు చేసి ప్రజలు రాకపోకలకు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి అన్నారు. మండలంలో మంగళవారం జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ముందుగా పెదశాఖ నుండి చినశాఖ వరకు రూ.34లక్షలతో 2.2 కిలోమీటర్ల రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. మసిమండ పంచాయతీ కప్పలవాడ నుంచి కిరికిట్టి వరకు రెండు కిలోమీటర్లు వరకు రూ.43 లక్షలతో రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. కొమరాడలో గల కెజిబివి పాఠశాలలో ఇటీవల రూ.12 లక్షలతో నిర్మించిన అదనపు భవనాన్ని ప్రారంభించారు. అనంతరం నూతనంగా రూ.54 లక్షలు మంజూరైన మండల రీసెర్చ్ భవనం, రూ.24లక్షల నిధులతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో సైన్స్ ల్యాబ్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ఏజెన్సీ గ్రామాల్లో డోలిమోహతలు లేకుండా ఉండేందుకు ప్రభుత్వం కొత్త రహదారులను సైతం మంజూరు చేసి శవేగంగా పనులు చేసి గిరిజనులకు రోడ్డు సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. అలాగే ప్రతి పాఠశాలలోని సైన్స్ ల్యాబ్‌లు, అదనపు తరగతులు గదులు నిధులు కేటాయించి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొత్త భవనాలు మంజూరు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మణిరాజ్, ఎఇ గౌరు నాయుడు, రాష్ట్ర తూర్పు కార్పొరేషన్ సంక్షేమ అభివృద్ధి డైరెక్టర్, మండల టిడిపి కన్వీనర్ ఎస్.ఉదయ్ శేఖర్ పాత్రుడు, ఎంపిడిఒ ఎస్.రమేష్, ఎంఇఒ తిరుపతిరావు, ఎఎంసి వైస్ చైర్మన్ జి.గౌరీశంకర్రావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాబ్బన్నారు.జనసేన కన్వీనర్ శ్రీకర్, బిజెపి కన్వీనర్ డి సురేష్ కుమార్, టిడిపి నాయకులు వి రాఘవ, బి భానుజీ రావు, హరి ప్రసాద్, బి శ్రీనివాస్ రావు, మరడాన కష్ణమూర్తి నాయుడు, కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యను పరిష్కరించండి : ఎమ్మెల్యేకు సిపిఎం వినతి

మండలంలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా చొరవ చూపాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ఎమ్మెల్యే జగదీశ్వరిని కోరారు. మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేకు పలు సమస్యలను విన్నవించారు. పార్వతీపురం నుండి కూనేరు మీదుగా మసి మండ గ్రామం మీదుగా లంజి గ్రామం వరకు బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కోరారు. అలాగే పార్వతీపురం నుండి కూనేరు వరకు నైట్ హాల్ట్‌ను కూడా పునరుద్ధరించాలని కోరారు. పార్వతీపురం నుండి కూనేరు వరకు మూడు రాష్ట్రాలకు వెళ్లే రహదారి పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో వాటిని పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పూర్ణపాడు –లాబేసు పనులను వెంటనే చేపట్టాలని కోరారు. ఈ సమస్యలను గతంలో కూనేరు సంతలో నిర్వహించిన ప్రజా దర్బారులో తెలిపామని, అయినా ఇంతవరకు ఎటువంటి పరిష్కారం చూపలేదన్నారు. ఇప్పటికైనా మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కారాన్ని చర్యలు చేపట్టాలని కోరారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కూరగాయల రైతు కుదేలు

- వర్షాలతో తెగుళ్లు బారిన పంటలు
- ధర అధికంగా ఉన్నప్పటికీ దిగుబడి కొరత

ప్రజాశక్తి – కొమరాడ

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు క్యాబేజీ, టమోటా కూరగాయల రైతులు పూర్తిగా కుదేలైన పరిస్థితి ఏర్పడింది. మండలంలోని కుమ్మరిగుంట, స్వామినాయుడువలస, గంగరేగువలస, గుణానుపురం, దుగ్గి, కల్లికోట తదితర గ్రామాల్లో టమాటా, కాకర, బీర, ఆనపకాయ, చిక్కుడు తదితర కూరగాయల పంటలు విస్తారంగా రైతులు సాగు చేస్తూ ఉంటారు. ఇటీవల అకాల వర్షాలతో ఈ కూరగాయల పంటలన్నీ పూర్తిగా తెగులుబారిన పడ్డాయి. దీంతో మొత్తం నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. అలాగే మండలంలో పాతకల్లికోటలో ప్రతి ఏటా సుమారు 30 మంది వరకు రైతులు కూరగాయల పంటను పండిస్తున్నారు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుందనుకున్న సమయంలో భారీ వర్షాలు వారి ఆశలపై నీళ్ల చల్లాయి. పాత కల్లికోటలో సుమారు 20 ఎకరాల్లో క్యాబేజీ సాగువుతోంది. కార్తీకమాసం సీజన్లో ఈ కూరగాయలకు మంచి డిమాండ్ పలకడంతో మంచి ధర పలుకుతుంది. దీంతో రైతులు కూడా క్యాబేజీ సాగుపై మొగ్గుచూపుతున్నారు. ఈ ఏడాది సీజన్‌లో పంట ప్రారంభమైనప్పటి నుంచి వర్షాలు కురవడంతో అనేక తెగుళ్లు సోకి పంట పూర్తిగా నష్టపోయిన పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేబేజీ సాగుకు ఎకరానికి సుమారు రూ.25 వేల నుంచి రూ.30వేలు వరకు పెట్టుబడులు అవుతున్నప్పటికీ కూడా ఈ ఏడాది మాత్రం మొక్క నాటిన అప్పటి నుంచి కూడా వర్షాలు అధికంగా కావడంతో పాటు పంట పూర్తిగా అనుకున్న స్థాయిలో పువ్వు రాకపోవడంతో మార్కెట్లో ధర పలకడం లేదని రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కనీసం పెట్టుబడులు కూడా రాకపోవడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు వారు తెలిపారు.

నాగావళి నది వరద ఉధృతి రెండుసార్లు రావడంతో పంట మొత్తం నీటిని మునిగి పూర్తిగా నాశనమైంది. ప్రతిసారి పంట నష్టం జరిగినప్పటికీ అధికారులు నామమాత్రంగా వచ్చే పరిశీలన చేసి వెళ్తున్నారు తప్ప పరిహారం చెల్లించడం లేదన్నారు. నష్టపోయిన పంటలను చూడ్డానికి వచ్చిన హార్టికల్చర్ అధికారులు పూర్తిగా నష్టపోతే పరిహారం ఇస్తామని చెప్పడంతో దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ మేరకు పంట నష్టం జరుగుతుందో ఆ మేరకు నష్టపరిహారం చెల్లించాల్సిన బాధ్యత అధికారులకు ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నష్టపోయిన పంటలను పరిశీలించి పరిహారం చెల్లించాలని కూరగాయల రైతులు కోరుతున్నారు.



గంగరేగువలసలో వర్షాలకు దెబ్బతిన్న టామాటా పంట



కాలేజీ ఆడిటోరియం స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

ఎస్‌విడి కాలేజీలో నూతన ఆడిటోరియానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక ఎస్‌విడి డిగ్రీ కళాశాలలో సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న ఆధునిక ఆడిటోరియం కల త్వరలో నెరవేరనుంది. దీని నిర్మాణానికి సంబంధించి మంగళవారం కీలక ముందడుగు పడింది. ఈ మేరకు కళాశాల ప్రాంగణంలో ఆడిటోరియం నిర్మాణానికి అనువైన స్థలాన్ని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి, కాలేజీ ప్రిన్సిపల్, మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు సంబంధిత అధికారులు పరిశీలించారు. ఈ ఆడిటోరియం బహుళ ప్రయోజనాలకు ఉపయోగపడేలా, అందరు విద్యార్థులు ఒకేసారి కూర్చునే సామర్థ్యంతో ఉండాలని నిర్ణయించారు. స్థల పరిశీలన సందర్భంగా, గ్రౌండ్ ప్లాన్, ఎంట్రన్స్, పార్కింగ్, భద్రతా అంశాలను బృందం పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు సెమినార్లు, వర్క్‌షాప్‌లు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి ఒక ఆధునిక వేదిక అవసరం ఎంతైనా ఉంది. స్థల పరిశీలన విజయవంతంగా పూర్తయిందని, అనుమతులు వచ్చిన వెంటనే నిర్మాణ పనులను వేగవంతం చేస్తామన్నారు. స్థల పరిశీలనలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్‌ఒ కె. హేమలత తదితరులు ఉన్నారు.

మంత్రిని కలిసిన సాధన సమితి బృందం

ప్రజాశక్తి - పాలకొండ

పాలకొండ పాత రెవెన్యూ డివిజన్‌ను జిల్లా చేయాలని, లేకుంటే శ్రీకాకుళం జిల్లాలో యథావిధిగా కలపాలని జిల్లా సాధన సమితి ప్రతినిధులు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు నిమ్మాడలో గల ఆయన క్యాంప్ ఆఫీస్‌లో మంగళవారం కలిసి కోరారు. నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పడాల భూదేవి ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం కలిసి బొబ్బిలి నియోజకవర్గాన్ని పార్వతీపురం జిల్లాలో కలపాలని అక్కడ ఉన్నవారు కోరుకుంటున్నారని, అలాగే పాలకొండ నియోజకవర్గం శ్రీకాకుళంలో కలిపేలా చూడాలని వారు కోరారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ అవకాశం ఉంటే ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో సాధన సమితి అధ్యక్షులు బి.అప్పలనాయుడు, గౌరవాధ్యక్షులు చౌదరి నాయుడు, సబ్బా నానాజీ, తుమ్మగుంట శంకర్రావు, రామకృష్ణ, సుధాకర్, కె.రమణ, వెన్నపు వెంకటరమణ, దుప్పాడ గణేష్ తదితరులున్నారు.

'రబీకి విఆర్‌ఎస్ నీరు రాదు'

ప్రజాశక్తి - మక్కువ

వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు రబీ పంటకు సాగునీరు ఇవ్వమని జిల్లా జల వనరుల శాఖ, నీటిపారుదల విభాగం కార్యనిర్వాహక ఇంజినీరు డిఎస్ ప్రదీప్ మంగళవారం వెల్లడించారు. ఈనెల 4న మండల టిడిపి అధ్యక్షులు జి.వేణుగోపాలనాయుడు విఆర్‌ఎస్ ప్రాజెక్టు నుంచి ఆయకట్టు భూములకు సాగునీరివ్వ పరిస్థితిపై స్పష్టత ఇవ్వాలని లేఖ రాయడంతో దానికి బదులుగా ఆయన సమాధానం ఇచ్చారు. ప్రాజెక్టు ఆధునీకరణ పనులు చేపడుతున్న కారణంగా ఈ నెల 15 నాటికి కాలువల్లో నీరు లేకుండా చూస్తామని తెలిపారు. 2028 వరకు ఆధునీకరణ పనులకు సమయం ఉందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఇప్పటివరకు 22 శాతం మాత్రమే పనులు పూర్తి చేశామన్నారు.



స్టాక్ వివరాలను అడిగి తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్ వైశాలి

జిసిసి స్టాక్ పాయింట్‌ను సందర్శించిన సబ్‌కలెక్టర్

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో కురుపాంలో గల స్టాక్ పాయింట్‌ను సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టాక్ పాయింట్లో నిల్వ ఉన్న అన్ని రకాల వస్తువుల రికార్డుల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించారు. స్టాకును ఏ డిపోలకు అందజేస్తారో సిబ్బందిని అడిగి తెలుసుకొని సక్రమంగా అందజేయాలని సూచించారు. ఆమె తహశీల్దార్ కె.జయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు యువత ముందడుగు

ప్రజాశక్తి - భామిని

పర్యావరణ పరిరక్షణకు యువత ముందడుగు వేసింది. మండలంలోని పర్యాటక ప్రాంతమైన నల్లరాయిగూడ జలపాతం వద్ద మంగళవారం యువత క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టడంతో పరిసరాలు కళకళలాడాయి. ఎపిడిఒ ఆధ్వర్యంలో నల్లరాయిగూడ యూత్ సభ్యులంతా కలిసి క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టి విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిడిఒ మాట్లాడుతూ ప్రకృతి అందాలను కాపాడుకోవడం మనందరి బాధ్యతని అన్నారు. యువత ఇలాంటి సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం చాలా సంతోషకరంగా ఉందని, వారి కృషికి మండల పరిషత్ నుంచి పూర్తి సహకారం ఉంటుందని అన్నారు. నల్లరాయిగూడ యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, జలపాతం పరిసరాలను శుభ్రం చేయడంలో చూపిన ఉత్సాహం, అంకితభావం స్థానికులను ఎంతగానో ఆకట్టుకుంది.

జిల్లాలో ప్రకృతి అందాలకు కొదవలేదు : డ్వామా పీడీ

ప్రజాశక్తి - సాలూరు

మన్యం జిల్లాలో ప్రకృతి అందాలకు, సహజ సిద్ధమైన జలపాతాలకు కొదవలేదని, ఇటువంటి అందమైన ప్రదేశాలను పర్యాటకంగా అభివృద్ధి చెందడానికి ఎంతో అవకాశాలు ఉన్నాయని డ్వామా పీడీ కె.రామచంద్ర రావు తెలిపారు. మంగళవారం దళాయివలస జలపాతాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ ప్రకృతి అందాలకు నిలయమైన మన్యం జిల్లాలో ఎన్నో జలపాతాలు చూడదగ్గ ప్రదేశాలు ఉన్నాయని, వీటిని వినియోగించుకుంటే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఇప్పటికే కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహించి ఈ ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఈ అభివృద్ధితో స్థానిక గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ రామకృష్ణంనాయుడు, ఇసి చిట్టిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు మినుము విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - కురుపాం

కృషి విజ్ఞాన కేంద్రంలో కొత్త రకాల మినుము విత్తనాలను కెవికె కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. ధ్రువ ఆధ్వర్యంలో రైతులకు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ ప్రమోద్ రైతులకు విత్తన శుద్ధి, తెగులు దాడి నుండి పంటను కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గూర్చి అవగాహన కల్పించారు. తాను చెప్పిన పద్ధతుల ప్రకారం పాటిస్తే ఎకరాకు 8 నుంచి 10 క్వింటాల వరకు దిగుబడి వస్తుందని రైతులకు సూచించారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్ అనంత విహారి, అమృతవేణి, రైతులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో గంట జగదీశ్వరరావు మృతి

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురానికి చెందిన గంట జగదీశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. జగదీశ్వరరావు కాంగ్రెస్, టిడిపిల్లో సీనియర్ నాయకులుగా కొనసాగారు. కురుపాం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, హై స్కూల్ విద్యా కమిటీ మాజీ చైర్మన్, వర్తక సంఘం నాయకులుగా పనిచేశారు. కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జగదీశ్వరరావు మృతి పట్ల పలు పార్టీలకు చెందిన నాయకులు, బంధువులు సంతాపం తెలిపారు.

పార్వతీపురం ప్రతిభను యువత చాటాలి

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

దేశ రాజధానిలో జిల్లా పేరును నిలబెట్టేలా యువత కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా యువజన సర్వీసుల శాఖ, సెట్విజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత తమ సత్తా చాటి ఢిల్లీకి వెళ్లేందుకు ప్రతిభ కనబరిస్తే వారికి ఢిల్లీ వెళ్లేందుకు తన సొంత డబ్బులతో ఫ్లైట్ టికెట్స్ తీసి, ఢిల్లీలో ఉన్న రోజులు వసతి కల్పించి, అక్కడ ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నానని పిలుపునిచ్చారు. యువత వారిలో ఉన్న నైపుణ్యాన్ని వెలుగులోకి తీసుకొచ్చి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడలతో పాటు యువత విద్యలో కూడా తమ ప్రతిభ కనబర్చాలన్నారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు చేసిన నృత్యాలను ఎమ్మెల్యే తిలకించి అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ టివి శైలజా రాణి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వై.నాగేశ్వరావు, జిల్లా యువజనోత్సవ అధికారి ప్రేమ్‌భరత్, అధికారులు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి యువజనోత్సవంలో ఎమ్మెల్యే

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

విద్యార్థులు క్రీడల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి అన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో జిల్లా యువజన సర్వీసుల శాఖ, సెట్విజ్ ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లా స్థాయి యువజనోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీవితం ప్రతి ఒక్కరూ ఏదో సాధించాలని కలలు కంటారని, అది కొంత వరకు సాధిస్తారని అన్నారు. యువతే దేశ భవిష్యత్తుకు వెన్నుముకని, విద్యార్థులు సామాజిక మార్పుకు శ్రీకారం చుట్టాలన్నారు. యువతలో నాయకత్వ లక్షణాలు, సామాజిక సేవా చైతన్యం, స్వచ్ఛ భారత్, డ్రగ్ ఫ్రీ ఇండియా వంటి అంశాలపై అవగాహన ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్‌ఒ కె.హేమలత, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వై.నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

జనవిజ్ఞాన వేదిక చెకుముకి మండల స్థాయి సైన్స్ సంబరాలు స్థానిక చర్చి వీధిలో గల డివిఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఘనంగా జరిగాయి. పాఠశాల స్థాయిలో విజేతలైన 15 పాఠశాలల నుంచి 20 బృందాలుగా 60 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో పట్టణ పాఠశాలల నుంచి కెపిఎం ఉన్నత పాఠశాల విద్యార్థులు 34 మార్కులతో ప్రథమ స్థానంలో నిలువగా, డివిఎంఎం విద్యార్థులు 28 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. పార్వతీపురం రూరల్ మండలం నుండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 26 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా, ఎన్ ములగ విద్యార్థులు 23 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల నుంచి భాస్కర ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు 31 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా, లయన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు 26 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థి బృందాలు జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలలో పాల్గొంటారు. ఈ పరీక్ష పేపర్లను డివిఎంఎం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.శ్రీధర్ ఆవిష్కరించారు. విజేతలకు ఎంఇఒలు వై.విమలకుమారి, కె.ప్రసాదరావు, వేదాంత కళాశాల కరెస్పాండెంట్ పి.అప్పారావు చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమం జనవిజ్ఞాన వేదిక మండల నాయకులు, ఆర్.సతీష్‌రాజు, యు.గోవింద రావు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు ఆధ్వర్యంలో జరగ్గా వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొని సహకరించారు.



పార్వతీపురంలో విజేతలకు బహుమతులు, ధ్రువపత్రాలను అందజేస్తున్న జెవివి నాయకులు

పాలకొండ : మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో ప్రతిభ సాధించి ప్రథమ స్థానం నిలిచిన తమ్మినాయుడు కళాశాల విద్యార్థులు పి.శ్రీవల్లి, సాధన, కొట్టుస శ్రీహర్షిని ద్వితీయ స్థానం సాధించారు. రోషన్, శ్యాం కుమార్, నరసింహనాయుడు జిల్లా పోటీలకు ఎంపికయ్యారు.

భామిని : స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్లో మండల స్థాయి సైన్స్ చెకుముకి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు మండలంలోని వివిధ జిల్లా పరిషత్ పాఠశాలల నుంచి 8, 9, 10 తరగతులు నుంచి ఒకొక్క విద్యార్థి చొప్పున ముగ్గురు విద్యార్థుల గ్రూపుగా ఈ పోటీలో పాల్గొన్నారు. ఈ పోటీల్లో భామిని ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి మండల స్థాయిలో మొదటి స్థానం నిలిచారు. మండల స్థాయి సైన్స్ చెకుముకి పోటీలో మొదటి స్థానం నిలిచిన విద్యార్థులు, జిల్లాస్థాయి చెకుముకి పోటీలో పాల్గొంటారని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ బాబురావు తెలిపారు. మండల స్థాయి ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ చెకుముకి సైన్స్ పోటీలు నిర్వాహణకు వివిధ పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి : యుటిఎఫ్

ప్రజాశక్తి - వీరఘట్టం

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. యుటిఎఫ్ మండల శాఖ బృందం మండలంలోని హుస్సేన్ పురం, కొంచ, కెజిబివి, వీరఘట్టం, రేగులపాడు, కత్తుల కవిటి, కె.ఇచ్చాపురం, గంగంపేట, ఎం.రాజపురం, చిదిమి, పివిఆర్ పురంలోని పాఠశాలలను సందర్శించింది. ఈ సందర్భంగా యుటిఎఫ్ ప్రతినిధులు మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని, 12వ పిఆర్‌సి కమిషన్‌ను పునరుద్ధరించి 29శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయించాలని, సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని, గిరిజన సంక్షేమ పాఠశాలల, కెజిబివి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మజ్జి పైడిరాజు, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కురమాన గోవిందరావు, బోనంగి దుర్గాప్రసాద్, నాయకులు పి.కృష్ణమూర్తి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషి చేస్తా : ఎంపిడిఒ

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఐవి లక్ష్మి మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈమె విజయనగరం జిల్లా ఎస్.కోట ఎంపిడిఒ కార్యాలయంలో డిప్యూటీ ఎంపిడిఒగా పని చేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా ఉన్న ఎల్.శ్రీనివాసరావు ఇఒపిఆర్డిగా కొనసాగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతమైన గుమ్మలక్ష్మీపురం మండలంలో తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించే అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ప్రజలు, తోటి ఉద్యోగులు సహాయ సహాయ సహకారాలు అందించాలని కోరారు.

పల్లె నుంచి ఢిల్లీ వరకు...

ప్రజాశక్తి - బలిజిపేట

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు అరసాడ విద్యార్థిని ఎంపికైంది. మండలంలోని అరసాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పి.వినీత జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు స్టాండ్ బై ప్లేయర్‌గా ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు పి.ఈశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు పి.బాలకృష్ణ తెలిపారు. ఇటీవల జరిగిన మండల, డివిజన్, జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర జట్టుకు ఎంపికైన వినిత శుక్రవారం నుండి సోమవారం వరకు కొవ్వూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపినందుకు జాతీయ స్థాయి పోటీలకు జట్టులో స్థానం సంపాదించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు వినీతను అభినందించారు. జాతీయ జట్టుకు ఎంపికైన వినీత మాట్లాడుతూ చదువుకు ఎలాంటి ఆటంకం లేకుండా ఏడాది నుంచి పాఠశాల సమయానికి ముందు, తర్వాత పూర్వపు వ్యాయామ ఉపాధ్యాయులు గణపతి మాస్టారు ప్రస్తుత వ్యాయామ ఉపాధ్యాయులు బాలకృష్ణ మాస్టారు ఆటలో శిక్షణ ఇచ్చారని, వారి సూచనలు మేరకు ఆటల్లో మెళకువలు నేర్చుకొని జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. తన విజయానికి దోహదపడిన ఉపాధ్యాయులకు, మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.



వినీతను అభినందిస్తున్న హెచ్‌ఎం

ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - సీతంపేట

ఆశ్రమ ఉన్నత పాఠశాల బాలురుకు మన్యం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపిడిఒ మిశ్రో, డిప్యూటీ ఎంపిడిఒ రామకృష్ణ ఆకస్మికంగా సందర్శించారు. పరిసరాలు పరిశుభ్రతను పాటించాలని సూచించారు. మరుగుదొడ్లు, బాత్‌రూంలను పరిశీలించారు. ప్రతి దినం మరుగుదొడ్లు ఉపయోగించిన తర్వాత, భోజనం ముందు చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు, అనంతరం వంటగదిని, స్టోర్ రూమ్ ను, భోజనశాలను సందర్శించారు విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రతి విద్యార్థి తలకు నూనె రాసుకుని దువ్వుకొని పౌడర్ రాసుకొని, ఉతికిన బట్టలు వేయాలని, చేతుల కాళ్ళ గోళ్లను కత్తిరించుకోవాలని అందంగా తయారవ్వాలని చెప్పారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రరావు, ఎంఇఒ సూర్యచంద్రరావు, వార్డెన్ గాసయ్య,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా ఇకెవైసి చేసుకోవాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

శ్రీ వెంకట సాయి భారత్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గ్యాస్ లబ్ధి పొందుతున్న వినియోగదారులు తప్పనిసరిగా ఇకెవైసి చేసుకోవాలని గ్యాస్ ఏజెన్సీ యజమాని కె.బొబిత కీర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ పరిధిలోని 27,582 కనెక్షన్లు ఉన్నాయని, ఇంతవరకు 22,255 మంది ఇకెవైసి చేసుకున్నారని, మిగిలిన వారు త్వరితగతిని ఇకెవైసి చేసుకోవాలన్నారు. లేనిపక్షంలో గ్యాస్ సరఫరా నిలిపివేస్తామని ఆమె అన్నారు. గ్యాస్ లబ్ధి పొందినప్పుడు ఒటిపి తప్పనిసరిగా చెప్పాలన్నారు. ఈ అంశాన్ని గ్యాస్ వినియోగదారులు గ్రహించాలన్నారు.

రాజ్యాంగంపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

భారత రాజ్యాంగంపై ప్రతి విద్యార్థికి అవగాహన ఉంటూ నిబంధనలు పాటించాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కుమార్‌స్వామి విద్యార్థులకు సూచించారు. మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను నిర్వహించగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన పువ్వుల శివాజీ, పక్కి రేష్మ, వడ్డీ జస్వంత్‌కు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులను జిల్లా స్థాయికి పంపనున్నట్లు తెలిపారు. ఈనెల 26న భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా జరుపుకోవాలని, దానిలో భాగంగా ప్రతి కళాశాలలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రామ్మోహనరావు, ఎం.రమేష్ కుమార్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎండిఎం ప్రైవేటీకరణ యోచనను విరమించుకోవాలి

ప్రజాశక్తి - సీతానగరం

పాఠశాలల్లో గత 20ఏళ్లుగా విజయవంతంగా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటీకరించేందుకు కూటమి ప్రభుత్వం యోచిస్తుందని, ఈ యోచనను విరమించుకోవాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వై.శాంతికుమారి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకటరమణ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన నిర్వహకులతో సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పాఠశాలల్లో ప్రస్తుతం నిర్వహిస్తున్న వంట విధానాన్ని రద్దుచేసి మండలానికి ఒక చోట స్మార్ట్ కిచెన్ పేరుతో సామూహిక వంటశాల నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారని ఈ ప్రయత్నాలను సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. వేలాదిమంది మంది విద్యార్థులకు ఒకే చోట వంటవండి వాహనాల ద్వారా పంపిణీ చేయాలనుకోవడం దుర్మార్గమైన చర్యని విమర్శించారు. దూర ప్రాంతాలకు ఈ విధానం అమలు చేస్తే పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పూర్తిగా అందకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. 20ఏళ్లుగా మధ్యాహ్న భోజన నిర్వహకులు సేవా దృక్పథంతో ఈ పథకం నిర్వహిస్తున్నారని లక్షల రూపాయలు ముందస్తు పెట్టుబడులు పెట్టి నిర్వహిస్తుంటే వారికి నష్టం చేకూర్చేలా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించడం ఎంతవరకు సమంజసమని ప్రభుత్వాన్ని నిలదీశారు, వీరందరికీ కనీస వేతనాలు చెల్లించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం చెల్లించకుండా, బకాయి జీతాలు బిల్లులు చెల్లించకుండా ఈ రకంగా ఉన్న ఉపాధిని కూడా తీయడం అత్యంత నీచమైన చర్యని విమర్శించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించి వారి వద్ద నుండి లక్షల్లో కమిషన్లు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు చేస్తున్న ప్రయత్నం ఇదని విమర్శించారు. ఈ ప్రైవేటీకరణ విధానాన్ని మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం, సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని, దీనిపై జిల్లా వ్యాప్తంగా పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. అందులో భాగంగా ఈనెల 12న స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టాలని కమిటీ నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శాంతికుమారి

ప్రైవేటీకరణకు నిరసనగా వైసిపి సంతకాల సేకరణ

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా వైసిపి ఆధ్వర్యాన కోటి సంతకాల సేకరణ మంగళవారం పార్వతీపురం పట్టణంలోని నాలుగురోడ్ల జంక్షన్‌లో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజల మద్దతు కోరుతూ వారి వద్ద నుంచి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా జోగారావు మాట్లాడుతూ ప్రజా వైద్యం ప్రజల హక్కు అని అన్నారు. ప్రజల నిర్ణయాన్ని రాష్ట్ర గవర్నర్‌కు తెలియజేసి ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా చేయమని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు మావుడి శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, పట్టణ వైసిపి అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి పోల సత్యనారాయణ, కౌన్సిలర్లు సభ్యులు , పార్టీ ప్రతినిధులు ముగడ జగన్మోహనరావు, గోగు గాయత్రి, షేక్ షఫీ, పాత గౌరీశంకరరావు, దేవుపల్లి నాగరాజు, కోల సుధాకర్, రెడ్డి రవికుమార్, నేరేడుబిల్లి సదానందం, సువ్వాడ శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సంతకాలను సేకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు, వైసిపి నాయకులు

కార్మిక హక్కులు కాలరాస్తే ఉద్యమిస్తాం

ప్రజాశక్తి - పాలకొండ

సిఐటియు ఆలిండియా మహాసభలను జయప్రదం చేయండి

కార్మిక హక్కులు కాలరాస్తే ఉద్యమిస్తామని, విశాఖలో డిసెంబర్ 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు జరగనున్న ఆలిండియా సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావల రమణారావు పిలుపునిచ్చారు. మండలంలోని తుమరాడలో రైస్ మిల్ కార్మికుల విస్తృతస్థాయి సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం రమణారావు మాట్లాడుతూ కార్మికుల ద్వారా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వారి హక్కులను కాల రాయడం దుర్మార్గమన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ తానఅంటే, తందాన అంటూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. ఇందులో భాగంగానే కార్మిక చట్టాలు మార్చడం, 10 గంటలు పని చేయాలని ఆదేశాలివ్వడం సరైంది కాదన్నారు. ఎనిమిది గంటలు నిద్ర, ఎనిమిది గంటలు శ్రమ, ఇతర పనుల కోసం ఎనిమిది గంటలు చేయాల్సి ఉండగా, వాటికి భిన్నంగా ప్రభుత్వం చేయడం దుర్మార్గమని తెలిపారు. అంతే కాకుండా కనీసవేతనం రూ. 26వేలు ఇవ్వాల్సి ఉండగా ఎక్కడా అమలు కాలేదని విమర్శించారు. కాంట్రాక్టు ఉద్యోగుల పరిస్థితి మరీ దారుణమని తెలిపారు. వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగ కార్మికుల పరిస్థితి మరీ ఘోరమన్నారు. విద్య, వైద్యరంగం, విద్యుత్ హమాలీ, విఆర్ఎ, మున్సిపల్, రిమ్స్, ఆప్కాస్, ఐఎంఎల్‌ది ఇదే పరిస్థితి అని విమర్శించారు. ముఖ్యంగా ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, ఎన్‌హెచ్ఎం, ఇతర అన్ని రకాల ఉద్యోగుల పరిస్థితి మరి దారుణం అని తెలిపారు. అన్ని రంగాల కార్మికులు, నాయకులు, కార్యకర్తలు సిఐటియు ఆలిండియా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గుమ్మడి పాపినాయుడు, బొచ్చ అప్పలనాయుడు, లాస గౌరి, రాగోలు గణపతి, తదితరులు కార్మికులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలో మంగళవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. మండలంలోని ములక్కాయవలస గ్రామ సమీపాన జరిగిన ప్రమాదంలో ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొని బైకుపై వెళ్తున్న మెకానిక్ జి.జగదీష్ గాయపడ్డాడు. అతడ్ని చికిత్స నిమిత్తం బొబ్బిలి హాస్పిటల్‌కు తరలించారు. ఈ ప్రమాదానికి కారణమైన బస్సును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే మక్కువ నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద సాలూరు నుంచి వయా మామిడిపల్లి మీదుగా దుగ్గేరు వెళ్లేందుకు వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో మక్కువ గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఆకుల తవిటి నాయుడు గాయపడ్డారు. మంగళవారం మధ్యాహ్నం ఇంటికి సరుకులు కొనుగోలు చేసేందుకు వచ్చిన తవిటినాయుడు తిరిగి వెళ్తుండగా, అదే సమయంలో దుగ్గేరు వెళ్లేందుకు మక్కువ ప్రధాన రహదారి వద్ద డ్రైవర్ బస్సును టర్న్ తీసుకొనే సందర్భంలో బస్సు ముందు భాగం అతడ్ని ఢీకొన్నట్లు తెలుస్తుంది. దీంతో తవిటినాయుడు కాలుకు తీవ్రగాయమవ్వడంతో చికిత్స కోసం విజయనగరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ రెండు ప్రమాదాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నదిలో పడి వృద్ధుడు గల్లంతు

ప్రజాశక్తి -పాచిపెంట

మండలంలోని మొసూరుకు చెందిన గండిపల్లి పెదరాములు (80) సోమవారం రాత్రి వట్టిగెడ్డలో గల్లంతయ్యాడు. వట్టిగెడ్డలో పడిపోయాడేమో నన్న అనుమానంతో కుటుంబసభ్యులు, స్థానిక పోలీసులు, రెవెన్యూ గాలింపు చర్యలు చేపట్టారు. ఈ గాలింపు చర్యల్లో భాగంగా సాలూరు మండలం శివరాంపురం గ్రామం దగ్గర గెడ్డలో పెదరాము మృతదేహం కర్రకు తగులుకుని ఉన్నట్టు మంగళవారం పోలీసులు, ఆ గ్రామస్తులు గుర్తించారు. వెంటనే కుటుంబసభ్యులు సమక్షంలో మృతదేహాన్ని పోలీసులు బయటకు తీశారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పాచిపెంట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు స్వాగతం పలికారు. సీనియర్ విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు మార్గనిర్దేశకులుగా ఉండాలని కష్టపడి చదివి ఉన్నత దశకు చేరాలని ప్రిన్సిపాల్ డాక్టర్ టి శ్రీవరం కోరారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ సన్యాసి ధ్రువ కోరారు. ఎటిడబ్ల్యూఒ రజిని మాట్లాడుతూ కష్టపడితే మంచి ఫలితం వస్తుందని, మంచి స్నేహితులు డిగ్రీలోనే కలుస్తారని తెలిపారు. భవిష్యత్తులో ఏం చేయాలో నిర్ణయించుకొని క్రమశిక్షణ, పట్టుదలతో చదవాలని అన్నారు. రిటైర్డ్ హెచ్ఎం హరిప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు విజ్ఞానమే కాకుండా వినయం కూడా కావాలని కోరుతూ విద్యార్థులను చైతన్యపరుస్తూ సందర్భానికి అనుగుణంగా చక్కటి గీతాలను ఆలపించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన పూర్వ విద్యార్థులకు ప్రతిభ ధ్రువపత్రాలను ఫోటో ఫ్రేమ్‌తో సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రామయ్య, ఐక్యు ఎసికో ఆర్డినేట్ స్వరూప, అధ్యాపకులు సిబ్బంది ఉన్నారు.

ఆశ్రమ పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని గంగంపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను మంగళవారం స్థానిక ఎంపిడిఒ బి.వెంకటరమణ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రతి తరగతి గదికి వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి విద్యాభివృద్ధిపై ఆరా తీశారు. మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు రుచికరమైన భోజనం విద్యార్థులకు అందించాలని ప్రధానోపాధ్యాయులు ఎం.భాస్కరరావును ఆదేశించారు. అలాగే పాఠశాలలో ముస్తాబు కార్నర్ కార్యక్రమం కూడా సక్రమంగా అమలు చేయాలన్నారు. ఆయనతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.